సంగారెడ్డి
నమస్తే తెలంగాణ
బుధవారం 1 మే 2024
WEDNESDAY, MAY 1, 2024



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రేపు బీఆర్ఎస్ రోడ్ షో

గుమ్మడిదల, ఏప్రిల్ 30: గుమ్మడిదలలో మే 2న నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ రోడ్ షోని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం గుమ్మడిదల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం గ్రామాల మీదుగా రోడ్ షో ఉంటుందని, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరవుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా బూత్ స్థాయి నుంచి ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణావిజయభాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యూనిఫాం సకాలంలో అందించాలి

మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో జంగారెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 30: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూనిఫాం సకాలంలో అందజేయాలని అదనపు డీఆర్డీవో జంగారెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని గ్రామీణ అభివృద్ధి సంస్థ పటాన్‌చెరు మండల మహిళా సమాఖ్య భవనంలో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాలకు స్కూల్ డ్రెస్‌లు కుట్టే ఆర్డర్ ఇస్తున్నదన్నారు. స్కూల్స్ ప్రారంభం అయ్యేలోగా యూనిఫాం అందజేయాల్సి ఉంటుందన్నారు. నాణ్యత, కచ్చితమైన సమయపాలనను అందిపుచ్చుకుంటే తప్పకుండా విజయం సాధిస్తారన్నారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఆర్డర్లు తీసుకొని సమయానికి పూర్తి చేయాలన్నారు. ఎక్కడ పొరపాటు జరిగినా విమర్శలు వస్తాయని చెప్పారు. బడి పిల్లల యూనిఫాం కాబట్టి బాధ్యతగా కుట్టి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ప్రకటించిన ధర అందుతుందన్నారు. ఆర్డర్‌ను ఛాలెంజ్‌గా తీసుకుంటే సక్సెస్ అవుతారని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ రవీందర్, డీపీఎం హెచ్‌డీ జయశ్రీ, ఏపీఎం శ్రీనివాస్, రిసోర్స్‌పర్సన్ సత్యవతి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, ఏప్రిల్ 30: నారాయణఖేడ్ మండలం పైడిపల్లికి చెందిన దౌల్తాబాద్ బేతమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. బేతమ్మ మృతికి గల కారణాలను తెలుసుకుని విచారం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నాయకులు సురేశ్, సాయిలు, నగేశ్, శ్రీమాన్, రత్నయ్య ఉన్నారు.

నేటి నుంచి యోగాలో శిక్షణ

కొండాపూర్, ఏప్రిల్ 30: వేసవిలో యోగా శిక్షణ తరగతులను మే 1 బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా గురువు విజయ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం గంగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు నేర్చుకోవచ్చని తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి

అంకెనపల్లి అంజమ్మ(ఫైల్)

రామచంద్రాపురం, ఏప్రిల్ 30: వడదెబ్బ కారణంగా ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్‌కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనివాస్‌నగర్‌కాలనీలో నివాసం ఉండే అంకెనపల్లి అంజమ్మ(53) ఇండ్లల్లో పనికి వెళ్తుంది. మంగళవారం యధావిధిగా పనికి వెళ్లిన ఆమె మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి కాస్త సేదతీరింది. తర్వాత నిద్రలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ డాక్టర్‌ని సంప్రదించడంతో ఆయన ఇంటికి వచ్చి చూసి అప్పటికే మృతిచెందిందని తెలిపారు. ఎండ సమయంలోనే పనికి వెళ్తుండడంతో వడదెబ్బ కారణంగా మృతిచెంది ఉంటుందని ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నారు.

మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానే..

- వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- గద్దెనెక్కి హామీలు విస్మరించిన కాంగ్రెస్
- ఎన్నికల ప్రచారంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

అనంతసాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, ఏప్రిల్ 30: మెదక్ ఎంపీ స్థానంలో మరోసారి గులాబీ జెండానే ఎగురుద్దని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అనంతసాగర్, సైదాపూర్, అలీయాబాద్, తొగర్‌పల్లి గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అమలుకాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసి అధికారాన్ని చేపట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పథకాలను పక్కన బెట్టి గాలి మాటలతో పబ్బం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రణమాఫీ, రూ.15 వేల రైతు బంధు, కల్యాణ లక్ష్మీలో తులం బంగారం వంటి పథకాల అమలు ఏమైందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి మాజీ సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యకర్తలు గ్రామాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేసేలా ప్రచారం ముమ్మరం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. గెలిచిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు అని చెప్పి మోసం చేసిన రేవంత్‌రెడ్డికి ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపించాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకపోతే దిగిపోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మావతీ పాండురంగం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకం విఠల్, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుక్మొద్దీన్, నాయకులు మల్లాగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, నగేశ్, రామాగౌడ్, నర్సింహులు, జడ్పీ కోఆప్షన్ అమీనొద్దీన్, జగదీశ్వర్, ఫయీం, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 30: పటాన్‌చెరు పట్టణంలో మే 8న నిర్వహించనున్న కేసీఆర్ రోడ్ షోకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలో ఇంద్రేశం, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల, ఐనోల్, రామేశ్వరంబండ, బచ్చుగూడెం, పోచారం గ్రామాల ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మే 8న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరులో పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్‌షో ఉంటుందని తెలిపారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు రోడ్ షోకు హాజరవుతారన్నారు. రోడ్ షో విజయంతానికి సమన్వయంతో పని చేయాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలో మంచి స్పందన వస్తున్నదన్నారు. ఏ ఇంటికి వెళ్లినా కారు గుర్తుకే ఓటేస్తామని చెబుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పటాన్‌చెరులో రూ.9వేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు పాండు, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిని వివరించాలి

జిన్నారం, ఏప్రిల్ 30: గడపగడపకూ బీఆర్ఎస్ పదేండ్ల అభివృద్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించాలని, మే 8న పటాన్‌చెరులో గులాబీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం జిన్నారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్, మండల అధ్యక్షుడు రాజేశ్, మాజీ సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, సత్యనారాయణ, శెట్టి శివరాజ్, జనార్దన్, రవీందర్, వెంకటయ్య, ఖదీర్, ఆంజనేయులు, గోవిందరాజు పాల్గొన్నారు.

కంగ్టి: పార్టీ ముఖ్యకార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి, ఏప్రిల్ 30: బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కంగ్టి మండలంలోని తడ్కల్ గ్రామంలో మండలస్థాయి ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటివరకు బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికై ఇటీవల బీజేపీలో చేరిన బీబీ పాటిల్ అధికారదాహంతో అక్కడికి వెళ్లారని ఆరోపించారు. కనీసం నియోజకవర్గాలకు కూడా అందుబాటులో ఉండని బీబీ పాటిల్ ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. గతంలో ఐదేండ్ల పాటు ఎంపీగా పనిచేసిన సురేశ్‌శెట్కార్ జహీరాబాద్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. తెలంగాణ నుంచి అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుపొందితే కేంద్రం మెడలు వంచి మనకు రావాల్సిన నిధులను రాబట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగారం, రైతుబంధు మండలాధ్యక్షుడు ఆంజనేయులు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను విస్మరించింది

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 30: పేదల సంక్షేమానికి పాటుపడిన బీఆర్ఎస్‌ను ఆదరించి, పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలలోని శికార్‌ఖానా, గౌడ్‌గాం జన్వాడా గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో నూతన మండలముగా ఏర్పాటైన నాగల్‌గిద్దలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన పలువురు స్వప్రయోజనాల కోసం మరోపార్టీలో చేరడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష్‌పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేత్రి పండరి, నాయకులు నందుపాటిల్, ప్రహ్లాద్, లక్ష్మణ్‌నాయక్, చందు పాటిల్, అప్పారావ్ పాటిల్, తదితరులు ఉన్నారు

మేడేను జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు

హత్నూర, ఏప్రిల్ 30: భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మేడేను విజయవంతం చేయాలని బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు కోరారు. మంగళవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్, బీజేపీలు కార్మికుల పొట్ట కొట్టే చట్టాలను తీసుకురావడంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరంచేసి కార్మికలోకానికి తీరని అన్యాయం చేశాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల మేలు కోరే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సాబేర్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

మాట్లాడుతున్న మంత్రి దామోదర

రాయికోడ్, ఏప్రిల్ 30: కార్యకర్తలు సైనికుల్లా పని చేసి కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. మంగళవారం మండల పరిధిలోని నల్లంపల్లిలోని పాటిల్ పంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదన్నారు. రాయికోడ్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఎంపీపీ మొగులప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్న పాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచ్ కేదారినాథ్ పాటిల్, యూత్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి ఉన్నారు.

కాంగ్రెస్ అంటేనే మోసం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, ఏప్రిల్ 30: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నదని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆరోపించారు. మంగళవారం మొగుడంపల్లి మండలంలోని జాడీ మల్కాపూర్, సజ్జారావుపేట్, మీర్జంపల్లి తండా, ఉప్పర్‌పల్లి తండా, విట్టునాయక్ తండా, చున్నంబట్టి తండా, జంగారబొలి తండా గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిందని, జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండానే, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండానే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని తప్పుడు లెక్కలు చెబుతున్నదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను తామే ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రూ.12వేలు, రైతు భరోసా రూ.15వేలు, నిరుద్యోగ భృతి రూ.4వేలు, పింఛన్లు రూ.4వేలు, కల్యాణలక్ష్మి చెక్కులు ఇవరికైనా అందాయా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారని, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల సమన్వయ కర్త దేవీప్రసాద్, ఎంపీటీసీ భరత్‌రెడ్డి, గుండప్ప, విజయ్‌కుమార్, సంజీవరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

గడపగడపకూ బీఆర్ఎస్ నేతలు

బొల్లారంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు హనుమంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి

బొల్లారం, ఏప్రిల్ 30: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. మంగళవారం బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం చేశారు. ఓల్డ్ విలేజ్ హనుమాన్ మందిరం నుంచి ప్రారంభించిన ప్రచారంలో గడపగడపకూ వెళ్లి మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. వెంకట్రామిరెడ్డి గెలిస్తే బొల్లారం పారిశ్రామిక వాడ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేణు పాల్ రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, బీరప్ప యాదవ్, సతీశ్, మాజీ ఎంపీటీసీ రత్నం, నాయకులు జైపాల్ రెడ్డి, యాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

మునిపల్లి, ఏప్రిల్ 30: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని పార్టీ రాష్ట్ర నాయకుడు సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతారం, పెద్దచెల్మెడ గ్రామాల్లో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ బీఆర్ఎస్ అని, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

టీఎస్ ఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి

కొండాపూర్, ఏప్రిల్ 30: మెదక్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్ మంగళవారం కొండాపూర్ మండలంలోని మల్కాపూర్, మల్లేపల్లి, గుంతపల్లి, మాందాపూర్ గంగారం, సీతారాంకుంట, దొబ్బకుంట, కొండాపూర్ తొగర్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీఎస్ ఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించి సోనియాగాంధీకి కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ మండలాధ్యక్షుడు ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్, మాజీ సర్పంచ్‌లు నర్సింహులు, వెంకటేశంగౌడ్, నాయకులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజలకు మేలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో పార్టీ శ్రేణులను, ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కుటుంబసభ్యులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 30: బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌తోనే ప్రజలకు మేలు జరిగిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లోని బీఆర్‌జీ గార్డెన్స్‌లో నిర్వహించిన తెల్లాపూర్ మున్సిపాలిటీ సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని చెప్పారు. పదేళ్ల కాలంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందిందని, అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. మెదక్ గడ్డపై అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, నాయకులు సోమిరెడ్డి, రవీందర్‌రెడ్డి, బాబ్జీ, శ్రీశైలం, మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, ఉమేశ్, సత్యనారాయణ, వెంకట్రామిరెడ్డి, రాజ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నారెడ్డి, నాగరాజు, కొమురయ్య, బాలయ్య, యాదయ్య, దయాకర్‌రెడ్డి, విష్ణు, రమేశ్, నర్సింహ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

ఊరూరా బీఆర్ఎస్ నేతల ముమ్మర ప్రచారం



పన్యాలలో ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

హత్నూర, ఏప్రిల్ 30: ప్రజల సంక్షేమానికి పాటుపడే పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హత్నూర మండలం సిరిపుర, తెల్లరాళ్లతండా, గోవింద రాజ్‌పల్లి, లింగాపూర్, పన్యాల, బడంపేట, మాధుర గ్రామాల్లో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే ఎన్నో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిని సాధించామన్నారు. ప్రజల సంక్షేమానికి పాటుపడే బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇంటింటికీ సంక్షేమ ఫలాలు చేరాయని, లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, నర్సింహారెడ్డి, రవి, ఆశయ్య, సురేందర్‌రెడ్డి, రాములు, వీరేందర్, శ్రీకాంత్, రాజు, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

97.86 శాతం ఉత్తీర్ణత

- పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు ఐదో స్థానం
- గతేడాదికంటే రెండు స్థానాలు దిగువకు
- 22,012 మందికి 21,540 మంది పాస్
- 435 మంది విద్యార్థులకు 10 జీపీఏ

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్షల ఫలితాలు మంగళవారం పాఠశాల విద్యా డైరెక్టర్ విడుదల చేశారు. ఈ ఫలితాల్లో 97.86 శాతంతో రాష్ట్రంలో జిల్లా 5వ స్థానంలో నిలిచింది. దీంతో గతేడాది స్థానానికి రెండు మెట్లు కిందికి పడిపోయింది. గతేడాది రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిన జిల్లా ఈసారి ఫలితాల్లో 5వ స్థానానికి పడిపోయింది. జిల్లాలో మొత్తం 22,012 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 21,540 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో 97.86 శాతం ఫలితాలు నమోదయ్యాయి. ఇందులో బాలురు 11,136 మంది పరీక్ష రాయగా, 10,852 మంది ఉత్తీర్ణత సాధించారు. 97.45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదేవిధంగా బాలికలు 10,876 మంది పరీక్ష రాయగా, 10,688 మంది ఉత్తీర్ణులయ్యారు. 98.27 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి ఫలితాలు విడుదలైన నేపథ్యంలో విద్యార